## క్లుప్తంగా

### ప్రతినెలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సత్తెనపల్లి: బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం సత్యధ్యాన మందిర ఆవరణలో ప్రతినెలా వివిధ రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. పట్టణంలోని సత్యధ్యాన మందిరం ఆవరణలో సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోపరాజు విజయ రామారావు అధ్యక్షతన సోమవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఉగాది పర్వదినం సందర్భంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులకు పురస్కారాలు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. పంచాంగం పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. సత్యధ్యాన మందిరానికి గోడ గడియారాన్ని నందిగామ సంపత్ కుమార్, గణపవరపు వెంకట మహేష్ బహూకరించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర నాయకుడు గణపవరపు రంగారావు, శాశ్వత సభ్యులు, సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం మాజీ అధ్యక్షులు, సత్యధ్యాన మందిర మాజీ అధ్యక్షులు పీసపాటి హనుమంతరావు, ఉన్నవ పూర్ణచంద్రరావును సన్మానించారు.

### కవయిత్రి మొల్లమాంబ జయంతి



సత్తెనపల్లి: ఒకటో వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, డాక్టర్ నిజాంపట్నం అమరేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంత్యుత్సవం సోమవారం నిర్వహించారు. పట్టణంలోని కవయిత్రి మొల్లమాంబ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శాత్రాసు పల్లి మాణిక్యాలరావు, శాత్రాసుపల్లి ఈశ్వరరావు, దరుపల్లి రామకోటయ్య, కోరంపల్లి హరి, రాజవరపు శివ నాగేశ్వరరావు, శాలివాహన పెద్దలు పాల్గొన్నారు.

### ఆర్‌ఐగా అనూష



నకరికల్లు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా దావులూరి అనూష సోమవారం బాధ్యతలు చేపట్టారు. బెల్లంకొండ మండలం జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనూష పదోన్నతిపై ఆర్‌ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

### ఆటోబోల్తా, ఇద్దరికి గాయాలు

ముప్పాళ్ళ: సత్తెనపల్లి–నరసరావుపేట రహదారిపై జీబీసీ కాల్వ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్ద సోమవారం ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడింది. ఆటో స్టీరింగ్ రాడ్ విరిగిపోవటంతో ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న నరసరావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ భాస్కరరావు, అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

### ల్యాబ్‌టెక్నీషియన్ల సేవలు భేష్



సత్తెనపల్లి: ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు భేష్ అని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్తా రామకృష్ణ కొనియాడారు. నేషనల్ ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా సోమవారం వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లను సత్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు, ఆర్‌ఎంవో శోభారాణి, డాక్టర్ లక్ష్మణరావు, హెడ్ నర్స్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పిచ్చిమొక్కల తొలగింపు



సత్తెనపల్లి: పట్టణంలోని తారకరామ సాగర్‌లో పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టారు. సోమవారం ప్రత్యేకంగా చెరువులోని కలుపు మొక్కలను కార్మికుల చేత తొలగింపజేశారు. ఈ పనులను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, శానిటరి ఇన్‌స్పెక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# నులిమేద్దాం



ఫణిదం పీహెచ్‌సీ వద్ద వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ యు.శ్రీలక్ష్మి కవిత, సిబ్బంది



రాజుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

- నేడు నులిపురుగుల నివారణ దినోత్సవం
- పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి రంగం సిద్ధం

సత్తెనపల్లి/క్రోసూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 14న మంగళవారం పాఠశాలలు, విద్యాలయాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి వైద్య, ఆరోగ్యశాఖ సిద్ధమైంది. దీనికోసం రంగం సిద్ధం చేసింది. సత్తెనపల్లి డివిజన్ వ్యాప్తంగా 13 ఆరోగ్యకేంద్రాలు ఉండగా, వీటిపరిధిలో మొత్తం 0–19 సంవత్సరాల విద్యార్థులు 1,12,545 మంది ఉన్నట్టు వైద్యశాఖ అధికారులు గుర్తించారు. వీరందరికీ మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశారు.

**క్రోసూరు మండలంలో 13,106 మంది విద్యార్థులు**

పాఠశాలు, కళాశాలల విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు క్రోసూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సాంబశివరావు సోమవారం తెలిపారు. వైద్యురాలు బాల అంకమ్మబాయి మాట్లాడుతూ మండలంలో మొత్తం 13,106 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**19ఏళ్లలోపు వారందరికీ మాత్రలు**

ముప్పాళ్ళ: 19ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు విధిగా అందించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మంగళవారం నులిపురుగల నివారణ దినోత్సవంలో భాగంగా మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి మాట్లాడుతూ మండలంలో మొత్తం 7,392 మంది ఉన్నట్లుగా గుర్తించామని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, ఎంఈఓ ఒంగోలురాజు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

**రాజుపాలెంలో ర్యాలీ**

**ఆరోగ్యకేంద్రాల వారీగా విద్యార్థుల సంఖ్య ఇలా...**

| ఆరోగ్యకేంద్రం | విద్యార్థుల సంఖ్య |
|---|---|
| వడ్డవల్లి యూపీహెచ్‌సీ | 6,130 |
| మార్కెట్‌యార్డ్ యూపీహెచ్‌సీ | 6,114 |
| వెంగళరెడ్డినగర్ యూపీహెచ్‌సీ | 5,867 |
| ఫణిదం | 12,565 |
| ముప్పాళ్ళ | 8,152 |
| రాజుపాలెం | 7,685 |
| నకరికల్లు | 7,152 |
| కుంకలగుంట | 5,217 |
| అచ్చంపేట | 10,111 |
| క్రోసూరు | 13,238 |
| చంద్రాజుపాలెం | 5,749 |
| 75 తాళ్లూరు | 8,512 |
| అత్తలూరు | 16,053 |
| మొత్తం | 1,12,545 |



ముప్పాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజుపాలెం: అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉదయలక్ష్మీ, ఉషారాణి, శివ, ప్రియదర్శిని, అలేఖ్య, లక్ష్మీ, దుర్గా పాల్గొన్నారు.

### పంపిణీకి పకడ్బందీ చర్యలు



సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ పరిధిలోని యూపీహెచ్‌సీల ద్వారా విద్యార్థులకు ఆల్బెడోజల్ మాత్రలు పంపిణీ చేసేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. నులిపురుగులు విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తాయి. చిన్నారులను రక్తహీనతకు గురిచేస్తోంది. ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చు . అన్ని పాఠశాలలకు మాత్రలు సరఫరా చేశాం.

– డాక్టర్ నాగ పద్మజ, డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్, సత్తెనపల్లి

## రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

**డ్వామా పీడీ జోసఫ్‌కుమార్**



ముప్పాళ్ళలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ముప్పాళ్ళ: ఉపాధిహామీ పనుల రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం జరిగింది. మండలంలో మొత్తం 390 పనులకు రూ.9,33,99,567 ఖర్చు చేశారు. ఈ పనుల్లో సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అవకతవకలను సభ్యులను ప్రజావేదికలో చదివి వినిపించారు. గ్రామాల్లో చేపట్టిన మొక్కల పెంపకం నిర్వహణ సక్రమంగా లేదని, రికార్డుల నిర్వహణ కూడా సరిగా చేయలేదని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో జాబ్ కార్డుల నమోదూ సరిగా చేయలేదని సభ్యులు వివరించారు. కూలీల మస్టర్ నమోదు చేయలేదని, పని ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేయలేదని వెల్లడించారు. ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 25 పనులకు రూ.3,35,89,633 పనులు చేపట్టినట్లు వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చేపట్టిన 9 పనులకు రూ.53,08,882 ఖర్చు చేసినట్టు వెల్లడించారు. అనంతరం పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ సుమారు రూ.6లక్షల విలువైన పనులపై అభియోగాలు ఉన్నాయని, వీటిపై విచారణ జరపాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతానికి రూ.28వేలు దుర్వినియోగమైనట్టు గుర్తించామని, వాటిని రికవరీ చేయాల్సి ఉందని వెల్లడించారు. సిబ్బంది రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయాలని ఆదేశించారు. ప్రజావేదికలో ఏపీడీ రఘుకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎస్సార్పీ ఈ.పున్నపునాయుడు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ రామారావు, డీఆర్పీలు బి.కృష్ణమూర్తి, టి.ఖాజా, పి.నాగరాజు, కె.సాగర్, ఎమ్.వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

## కమీషన్ వ్యాపారి మోసం చేశాడు

**తాళ్లచెరువు రైతుల ఆవేదన**

అచ్చంపేట: పంటను కొన్న కమీషన్ వ్యాపారి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడంటూ తాళ్లచెరువు గ్రామానికి చెందిన కొందరు రైతులు, మహిళా రైతులు సోమవారం అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే తాళ్లచెరువు గ్రామానికి చెందిన ఓ కమీషన్ వ్యాపారి 2021 ఏప్రిల్‌లో రైతుల వద్ద 140 క్వింటాళ్ల మిర్చి పంటను క్వింటా ఒక్కంటికి రూ.12,000 చొప్పున రూ.16లక్షలకు కొన్నాడు. వారంలో డబ్బులు ఇస్తానని చెప్పాడు. రెండేళ్లయినా ఇప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. ఇప్పుడు చేతనైంది చేసుకోవాలని దబాయిస్తున్నాడు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్‌ఐ కె.పాల్ రవీంద్ర తెలిపారు.

### ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం



సత్యనారాయణ మాస్టారును సన్మానిస్తున్న జూపూడి బీసీ కాలనీ వాసులు

అమరావతి: జూపూడి బీసీ కాలనీలోని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న బలుసుపాటి సత్యనారాయణకు ఇటీవల ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పించి దాచేపల్లి మండలం ఇరికేపల్లి ఎంపీయూపీ స్కూల్‌కు బదిలీ చేసింది. ఈ సందర్భంగా సోమవారం జూపూడి బీసీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో బలుసుపాటి సత్యనారాయణను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బత్తుల శంకరరావు ఆధ్వర్యంలో సన్మానించారు.

### ఆపదమిత్ర శిక్షణ

అమరావతి: నరుకుళ్ళపాడు సచివాలయంలో సిబ్బందికి, వలంటీర్లకు సోమవారం ఆపదమిత్ర శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ దొడ్డా శివగోపి అత్యవసర పరిస్థితులలో మనుషులను కాపాడే పలు పద్ధతులను వివరించారు. గ్యాస్ లీకైనప్పుడు ఎలా వ్యవహరించాలి? ఆపద నుంచి ఎలా కాపాడాలి? వంటి విధానాలు వివరించారు. మనిషి గుండె ఆగినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధురి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

### 22న సాయిబాబా మందిరం వార్షికోత్సవం

క్రోసూరు: క్రోసూరులోని షిర్డీసాయిబాబ మందిర వార్షికోత్సవం ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు సోమవారం తెలిపారు. ఏటా ఉగాది నాడు సాయిబాబ మందిర వార్షికోత్సవం నిర్వహించడం విశేషమని వెంకట్రావు వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై బాబాను దర్శించుకోవాలని కోరారు.

### తొండపిలో ఫ్యామిలీ డాక్టర్

తొండపి(ముప్పాళ్ళ): తొండపి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, సూర్యప్రకాశరావు పాల్గొని 82 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులను అందించారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమైన వారికి వైద్య సేవలందించారు. పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ సుగుణ, సూపర్‌వైజర్లు పీటర్‌డానియేన్, భవానికుమారి, డీఈఓ రవితేజ, ఆశ, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

### కెనరా బ్యాంక్ కార్ లోన్ మేళా

సత్తెనపల్లి: పట్టణంలోని కెనరా బ్యాంక్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో జయలక్ష్మి మారుతి సుజుకి మెగా కార్ లోన్ మేళా సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బ్రహ్మ రాజు, అసిస్టెంట్ మేనేజర్ అనురాధ, అప్రైజర్ దేవరశెట్టి రవి కుమార్, మల్లేశ్వరరావు జయలక్ష్మి మారుతి సుజుకి నరసరావుపేట తరపున బ్రాంచ్ మేనేజర్ శ్రీరామ్, జయ, ఎగ్జిక్యూటివ్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

### క్రోసూరు ఏఎంసీ అభివృద్ధికి కృషి చేస్తా



పెదకూరపాడు: క్రోసూరు మార్కెట్ యార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కొత్తగా ఎన్నికైన క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి చెప్పారు. సోమవారం పెదకూరపాడు మండల గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈదా సాంబిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### కిడ్నీ వ్యాధులపై అవగాహన

మాచర్ల: పట్టణంలోని మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ప్రపంచ కిడ్నీ వ్యాధుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డాక్టర్ వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపోలో డయాలసిస్ సెంటర్ పర్యవేక్షణలో పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు అందించనున్నట్లు చెప్పారు. నెహ్రూ నగర్, గాడకాలనీ, వివిధ నర్సింగ్ విభాగాల సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రభుత్వ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

### 'నులి పురుగుల నిర్మూలన'ను జయప్రదం చేయాలి

మాచర్ల: జిల్లాలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యులు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డాక్టర్ అరుణ్‌కుమార్, లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పోస్టర్లు ఆవిష్కరించారు. మంగళవారం ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఏదైనా ఆటంకం కలిగితే 104కు ఫోన్ చేయాలని సూచించారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

రాజుపాలెం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. వేసవి సమీపిస్తున్నందున మంచి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చేతిపంపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ముందుగా మండల స్థాయి అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. తహసీల్దార్ నళిని మాట్లాడుతూ కొండమోడు నుంచి పేరేచర్ల వరకు జాతీయ రహదారి నిర్మాణం కోసం మండలంలో ఇళ్లు, భూములు పోయే రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు వెల్లడించారు. ఈ నెల 14వ తేదీ నుంచి జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఎంఈవో బి.మల్లికార్జునశర్మ, డాక్టర్ రవితేజనాయక్, ఏపీవో చెవుల వెంకటేశ్వర్లు, ఏపీఎం సునీత, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక సాయం



సహాయం అందుకుంటున్న విద్యార్థిని

సత్తెనపల్లి: వాసవి విజ్ఞాన జ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ, రాఘవేంద్ర బాల కుటీర్ సంయుక్త ఆధ్వర్యంలో 28 మంది పేద విద్యార్థులకు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి గ్రామ సమీపంలోని వాసవి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు రూ.1.05 లక్షల మేర ప్రోత్సాహకాలు అందించారు. కొత్తగా నిర్మించిన శిఖకొలను సూర్యనారాయణ, రాఘవలీలా కుమారి మందిరాన్ని వారి వారసులు ప్రారంభించారు. అనంతరం ఎస్‌వీకేపీ సొసైటీ అధ్యక్షులు త్రిపురమల్లు వెంకట దుర్గా మల్లేశ్వర రావు, సత్తెనపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర విశ్వనాథం, నరసరావుపేట సింధూ కొత్త వెంకట రామకృష్ణ, పిడుగురాళ్ల వృద్ధాశ్రమ సేవా సమితి, అనాథ, వృద్ధాశ్రమం నిర్వాహకులు ఆత్మకూరి లక్ష్మీనరసింహమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో వాసవి విజ్ఞాన జ్యోతి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వెలుగూరి సుబ్బారాయుడు, అధ్యక్షుడు ఏలూరి పద్మాకర్ మురళీకృష్ణ, కార్యదర్శి జమిలి రాధాకృష్ణమూర్తి, కోశాధికారి ఆత్మకూరి హరిచంద్ర ప్రసాద్, తూనుగుంట్ల ఉమామహేశ్వరరావు, పెరుమాళ్ళ లక్ష్మీశివ నారాయణ, పోతుగంటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

## మైనార్టీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



కమ్యునిటీహాలుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

అచ్చంపేట: మాదిపాడులో రూ.15 లక్షలతో నిర్మించతలపెట్టిన మైనార్టీ కమ్యూనిటీ హాలుకు సోమవారం ఎంపీటీసీ భూక్యా రమేష్‌స్వర్ణమ్మభాయ్, సర్పంచ్ మాదా ఈశ్వరమ్మవెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్వర్ణమ్మభాయ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో కమ్యూనిటీ హాలు సాకారం కాబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు షేక్ కరీమ్, లాలు, జాన్‌సాహెబ్, సుభాని, బీసీ నాయకులు మునగాల శేషగిరి, ఎస్సీ నాయకులు చిట్యాల దావీదు, సత్తెమ్మతల్లి దేవాలయ కమిటీ చైర్మన్ గుదారి గోపియాదవ్, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ యాంపొంగు దాసు, స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ లాలు తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలను వేగంగా పరిష్కరించండి



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న మాచర్ల అధికారులు

మాచర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందనలో వచ్చిన ప్రతి అర్జీనీ వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ శివశంకర్ కోరారు. సోమవారం మండలస్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యులు, వైద్య సిబ్బంది డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలన్నారు. వేసవిలో వలసల నివారణకు ఉపాధి హామీ పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. హైవే, జగనన్న మీ భూమి రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది చురుగ్గా పాల్గొని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంఈఓ వేముల నాగయ్య, డెప్యూటీ తహసీల్దార్ వాణి పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ నాయకుడు జవ్వాజి మృతి



వెంకటేశ్వర్లు యాదవ్ (ఫైల్)

కారెంపూడి: మండల బీసీ నాయకుడు పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన జివ్వాజి వెంకటేశ్వర్లు యాదవ్(60) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేశ్వర్లు గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి వెంకటేశ్వర్లు ఎనలేని సేవలందించారు. ఆయన సేవలను గుర్తించి రెండో విడత గ్రామ సర్పంచ్‌గా వెంకటేశ్వర్లు భార్య నాగమణిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎంపిక చేశారు. వెంకటేశ్వర్లు మృతి వార్త పట్ల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గుంటూరు నుంచి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి స్వగ్రామానికి తరలించనున్నారని తెలుస్తోంది. గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

## ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి



మాచవరం: ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చూడాలని ఎంపీడీఓ వై.రాజగోపాల్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, సచివాలయ ఏఎన్‌ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,200 మంది చిన్నారులు ఉన్నారని, నూరుశాతం మాత్రలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్, ఎంఈఓ ప్రసాద్, విస్తరణాధికారి పట్టాబి, సిబ్బంది సురేష్,చిన్నమ్మ, చిన్నారి రోజ తదితరులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ మోసాలపై కళాజాత

విజయపురిసౌత్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కర్నూల్ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మాచర్ల ఆధ్వర్యంలో మండలంలోని బెల్లంకొండ వారి పాలెం గ్రామంలో ఆదివారం రాత్రి బ్యాంకింగ్ పథకాలపై రాంబాబు కళాజాత బృందం ప్రత్యేక ప్రదర్శన ఇచ్చింది. ఆర్థిక అక్షరాస్యత, ఆన్‌లైన్ మోసాలను కళ్లకు కట్టింది. సైబర్‌నేరాలపై 1930కి ఫిర్యాదు చేయాలని కళాజాతా బృందం సూచించింది. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ ఏలూరి నాగరాజు, వీవోఏ పాల్గొన్నారు.